# ఉన్న ఊళ్లోనే ఉపాధి!

● వక్క తోటలతో కూలీలకు సమృద్ధిగా పనులు ● ఆరు నెలలు ఢోకా ఉండదని హర్షం


అమరాపురం మండలంలో సాగులో ఉన్న వక్క తోట


నాణ్యమైన వక్కను వేరు చేస్తున్న కూలీలు

**అమరాపురం:** జిల్లాలో ఎక్కడ లేని విధంగా మడకశిర నియోజకవర్గంలో వక్కతోటలను రైతులు సాగు చేశారు. మడకశిర నియోజకవర్గంలోని అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాల్లో అత్యధికంగా 5 వేల ఎకరాల వరకూ వక్క తోటలను రైతులు బోరు బావుల కింద సాగు చేశారు. ఈ నేపథ్యంలో ఇది కూలీలకు ఎంతగానే ఉపాధి ఇస్తోంది. వక్కతోటలతో అటు రైతులు, ఇటు కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది.

### ఆరు నెలల పాటు పనులు

జూలై మాసం నుంచి ప్రారంభమైన వక్క పనులు డిసెంబర్ వరకూ దాదాపు ఆరు నెలల పాటు ఉంటాయి. ఆడ మగ తేడా లేకుండా అందరికీ పని పుష్కలంగా దొరుకుతుంది. ముఖ్యంగా అమరాపురం మండలంలో కూలీలకు మంచి డిమాండ్ ఏర్పడింది. మగ కూలీలకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ రెండు పూటల భోజనం పెట్టి రూ.600 నుంచి 700 వరకు కూలి ఇస్తున్నారు. అలాగే ఆడ కూలీలకు రోజుకు రూ.400 ఇస్తున్నారు. ముఖ్యంగా వక్క తోటలో గెలను కోసిన తరువాత గెలలో ఉన్న వక్క, నేల మీదకు పడిన వక్కను ఆడ, మగ కూలీలు బస్తాలో నింపుతారు. అలాగే గెల నుంచి వక్కను వేరు చేస్తారు. అక్కడి నుంచి గ్రామంలోకి తీసుకొచ్చి యంత్రాల సహాయంతో వక్క చిప్పను వేరు చేస్తారు. మంచి నాణ్యమైన వక్కను ఆడ కూలీలు వేరు చేసి ఆ తర్వాత ఉడకబెడతారు. అనంతరం ఉడికించిన వక్కను టార్పలిన్ మీద వేసి వారం రోజులు ఆరబెడతారు. దీంతో కూలీల అవసరం అధికంగా ఉంటుంది. ఉపాధి పనులకు వెళ్లినా రోజుకు ఇంతా డబ్బు రాదని కూలీలు చెబుతున్నారు.

**మడకశిరలో వక్కసాగు ఇలా..**

| మండలం | విస్తీర్ణం |
|---|---|
| అమరాపురం | 4000 ఎకరాలు |
| మడకశిర | 50 ఎకరాలు |
| గుడిబండ | 250 ఎకరాలు |
| రొళ్ల | 400 ఎకరాలు |
| అగళి | 300 ఎకరాలు |

### చేతినిండా పని దొరుకుతోంది



వక్క సీజన్ వచ్చిందంటే చేతినిండా పని దొరుకుతోంది. ఒక్కరోజు కూడా ఇంటివద్ద ఖాళీ ఉండను. రోజూ రూ.600 సంపాదిస్తాను. వలస పోవడం కంటే ఉన్న ఊరిలో వక్కతోటల పనులు చేసుకోవడం ఎంతో మేలు. ఆరు నెలల పాటు కూలీ దొరుకుతుంది. కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు.

– రాజు, కూలి, తమ్మడేపల్లి


వక్కను ఉడకబెడుతున్న కూలీలు

### ఉపాధి పనులకంటే మేలు



ఉపాధి కూలి పనులకంటే వక్క తోటకు వెళ్లడం ఎంతో మేలు. ఉన్న ఊరిలోనే పని దొరుకుతుంది. అంతేకాక అన్ని పోను రూ.600 చేతికి వస్తోంది. కుటుంబ పోషణకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. పిల్లల చదువుకు ఉపయోగపడుతోంది. కూలీలకు వక్క తోటలు వరంగా మారాయి.

– కాంతరాజు, కూలి, గౌడనకుంట

## క్లుప్తంగా

### టమాట వాహనాల బోల్తా


జాతీయ రహదారిలో పడిపోయిన టమాటాలు

**లేపాక్షి:** మండల పరిధిలోని జాతీయ రహదారి వద్ద ఉన్న గలిబిపల్లి క్రాస్‌లో ప్రమాదవశాత్తూ రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. వివరాలు .. సోమవారం తెల్లవారుజామున హిందూపురం నుంచి మదనపల్లి వైపు బొలెరో, ఈచర్ వాహనాలు వెళ్తున్నాయి. అయితే అతి వేగంగా ఓవర్ టేక్ చేయబోయి డివైడర్లను ఎక్కించడంతో రెండు వాహనాలు అదుపు తప్పి బోల్తా పడ్డాయి. వాటిలో ఉన్న టమాటలు చెల్లాచెదురు అయి రోడ్డుపై పడిపోయాయి. అయితే డ్రైవర్లు, రైతులకు ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

### ఉపాధ్యాయుడి మృతి


రహమతుల్లా (ఫైల్)

**పరిగి:** మండలంలోని సేవా మందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు రహమతుల్లా (56) అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

### మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన తిప్పేస్వామి


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి

**మడకశిర:** మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సోమవారం తిరుపతిలో స్థానిక మాజీ ఎమ్మెల్యే, సీఈసీ సభ్యుడు తిప్పేస్వామి కలిశారు. ఇటీవలనే తిప్పేస్వామిని పార్టీ హైకమాండ్ సీఈసీ సభ్యుడిగా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. సీఈసీ సభ్యుడిగా ఎంపికయ్యేందుకు సహకరించిన మాజీ మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### డ్రైవర్‌పై కేసు నమోదు

**రొళ్ల:** మండల పరిధిలోని కొడగార్లగుట్ట కాలనీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన దాసప్పపాళ్యంకి చెందిన డ్రైవర్ వసంతకుమార్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఇదయతుల్లా పేర్కొన్నారు.

### వాల్మీకి విగ్రహావిష్కరణ


వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**రొద్దం:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ , వైఎస్సార్‌సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### మడకశిరలో నటుడు నరేష్


ఎమ్మెల్యే ఎంఎస్ రాజు క్యాంప్ కార్యాలయంలో నరేష్

**మడకశిర:** సినీ నటుడు నరేష్ సోమవారం మడకశిరను సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజును క్యాంప్ కార్యాలయంలో కలిశారు. కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసమూర్తి తదితరులు ఉన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

**మడకశిర:** సమస్యలు పరిష్కరించడానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కవిత కోరారు. సోమవారం మడకశిర మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో జరిగింది. ఈసమావేశానికి కవిత అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. వైస్ ఎంపీపీ నరసింహమూర్తి మాట్లాడుతూ పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, పరిష్కరించాలని కోరారు.

## కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్


క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

● వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

**అగళి:** కూటమి పాలనలో అన్యాయానికి గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కోసమే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ , నాయకులు, కార్యకర్తలతో కలసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. సోషల్ మీడియా వారిని కూడా వదిలి పెట్టకుండా కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. రెడ్‌బుక్‌కు దీటుగా డిజిటల్ బుక్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కూటమి నాయకులు, అధికారులు పెట్టే ఇబ్బందులు, అరాచకాలు, అక్రమ కేసులు, దాడులు జరిగితే వాటి ఫోటోలు, దాడికి సంబంధించిన ఘటనలను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి లొకేషన్ షేర్ చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అందరిపై చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కక్షసాధింపు రాజకీయం చేస్తున్న కూటమి ప్రభుత్వం నాయకులకు ,అధికారులు బుద్ధిచేప్పే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ జయకుమార్, సర్పంచులు కృష్ణప్ప, రామకృష్ణప్ప, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు జయరామప్ప, నాయకులు నాటరాజు, హనుమంతరాయప్ప, శివన్న, తిమ్మరాయప్ప, సూర్యనారాయణరెడ్డి, వెంకటస్వామి, గురులింగప్ప , లింగరాజు, లలిత, బోజేగౌడ్, సన్నప్ప, గంగధర్, శంకరప్ప, గిరీష్, ప్రకాష్, కాంతరాజు, శివన్న, హనుమంతరాయప్ప, ఈరన్న, గోవిందప్ప మంజునాథ్, నాగరాజు, శ్రీనివాసులు, మైలరప్ప, శివరాజు, హనుమంతరాజు, హర్ష, గంగధర్, హరీష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌పై లోకాయుక్తలో ఫిర్యాదు


లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన న్యాయవాది గోవిందరాజులు

**చిలమత్తూరు:** హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునపై న్యాయవాది గోవిందరాజులు సోమవారం కర్నూలులోని లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురం వరకూ ఉన్న ఎస్‌కెడీ పంప్‌హౌస్ వద్ద మరమ్మత్తులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ రిపేరీ కోసం టెండర్లు పిలవగా సివిల్ కాంట్రాక్టర్ అయిన ప్రభాకర్ భార్గవ్ ఇండస్ట్రీస్ ఇచ్చినట్లు ఫేక్ సర్టిఫికెట్ పొందుపరిచి టెండరు దక్కించుకున్నాడు. అయితే ఈ తతంగాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. టెండర్ వేసిన మరొకరికి ఆ టెండర్‌ను ఖరారు చేశారు. అయితే మోసం చేసి టెండరు దక్కించుకోవాలని చూసిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని లోకాయుక్త దృష్టికి తీసుకువెళ్లారు. న్యాయవాది మాట్లాడుతూ కమిషనర్ మల్లికార్జున కాంట్రాక్టర్ ప్రభాకర్‌తో కుమ్మక్కై మున్సిపాలిటీ నిధులను పక్కదారి పట్టిస్తున్నాడని, జీఓ నెం 174, 178 ప్రకారం విరుద్ధంగా ఈ ప్రొక్యూర్‌మెంట్ నిర్వహించారని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

## బోధనతో పాటు క్రమశిక్షణ అవసరం


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ పరిశీలకులు వెంకటేశ్వరరావు

**హిందూపురం టౌన్:** విద్యా బోధనతో పాటు క్రమశిక్షణ, సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో ముఖ్యమని నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఎస్‌సీఈఆర్‌టీ పరిశీలకులు డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. మూడు రోజులుగా హిందూపురం సమీపంలోని బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న శిక్షణా తరగతులను సోమవారం ఆయన పరిశీలించారు. నూతన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ కాలానుగుణంగా విద్యాబోధనను అలవర్చుకోవాలని సూచించారు. ఎంఈఓలు గంగప్ప, శేషాచలం, లక్ష్మీదేవి, ఎస్.ఆర్.బాబా, భారత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోవధ శాలల తొలగింపు


హిందూపురం: గోవధ శాలలను తొలగిస్తున్న దృశ్యం

**హిందూపురం/చిలమత్తూరు:** హిందూపురం పట్టణంలోని పరిగి రోడ్డులోని గోవధ శాలలను పోలీసులు సమక్షంలో అధికారులు తొలగించారు. పశువులను ఇష్టానుసారం వధిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసు కూడా నమోదు చేశారు. వధశాలల్లో ఉన్న దాదాపు 90 పశువులను గోశాలలకు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు.

## విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ


విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి

**హిందూపురం టౌన్:** గత విద్యా సంవత్సరం ఇంటర్ వార్షిక పరీక్షల్లో బాలయేసు జూనియర్ కళాశాలకు చెందిన సీమ సాదియా 988 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. ఈ నేపథ్యంలో కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, ప్రిన్సిపాల్ శౌరిరెడ్డి సీమ సాదియాను అభినందించారు. విద్యార్థినికి ల్యాప్ టాప్ ను బహుమతిగా అందించారు. బలరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సీమ సాదియాను స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలన్నారు.

## వీఓఏల సమస్యలు పరిష్కరించండి

**అమరాపురం:** మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్న వీఓఏల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజుకు మండలంలోని వీఓఏలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీఓఏలు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పీఎసీఎస్ అధ్యక్షుడు గణేష్, ఎంపీడీఓ రామరావు తదితరులున్నారు.

## సంక్షిప్త సమాచారం

### మూడు పంచాయతీలకు స్వచ్ఛాంధ్ర అవార్డులు


అవార్డు అందుకుంటున్న కిరికెర సర్పంచ్, అధికారులు

**హిందూపురం:** హిందూపురం డివిజన్‌లో మూడు పంచాయతీలను ఉత్తమ పంచాయతీలు ఎన్నిక చేశారు. దీంతో ఆయా గ్రామ పంచాయతీలకు ప్రశంస పత్రాలతో పాటు జిల్లా స్వచ్ఛాంధ్ర అవార్డులు అందజేశారు. సోమవారం పుట్టపర్తిలో కలెక్టర్ శ్యాంప్రసాద్, డీపీఓ సమత, ఎమ్మెల్యే సింధూరరెడ్డి సమక్షంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను సర్పంచులకు అందించారు. కిరికెర పంచాయతీ వైఎస్ భాగ్యమ్మ, తూమకుంట సర్పంచ్ రత్నమ్మ, బిసలమానేపల్లి నాగేంద్రతో పాటు ఆయా గ్రామ కార్యదర్శులకు కలిపి అవార్డులు అందించారు.

**'పురం' ఎంపీడీఓగా ఆనందప్రసాద్**

**హిందూపురం:** రొద్దం ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆనందప్రసాద్‌కు హిందూపురం ఎంపీడీఓగా పూర్తి బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సరస్వతి పదోన్నతిపై వైఎస్సార్ జిల్లా డీడీవోగా బదిలీ అయ్యారు.

**మణూరు చెరువుకు జలహారతి**

**మడకశిరరూరల్:** మండల పరిధిలోని మణూరు చెరువులోకి హంద్రీనీవా కాలువ ద్వారా ప్రవహిస్తున్న కృష్ణాజలాలకు సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చెరువులో జలహారతి ఇచ్చారు..

**విద్యుత్ పరికరాల చోరీ**

**పెనుకొండ రూరల్:** మండంలోని మునిమడుగులో రైతు రమేష్‌కు చెందిన వ్యవసాయ పొలంలో ఆదివారం రాత్రి రెండు స్టార్టర్ పెట్టెలను, కేబుల్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. బాధిత రైతు సోమవారం కియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**పక్కాగా భూ రీసర్వే**

**పరిగి:** ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే గ్రామాల్లో పక్కాగా రీసర్వే చేపట్టాలని తహసీల్దారు హసీనా సుల్తానా తెలిపారు. సోమవారం మండలంలోని పీ నరసాపురం రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులను ప్రారంభించారు. తొలుత గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీని చేపట్టారు.

**డప్పు కళాకారుల ధర్నా**

**గోరంట్ల:** డప్పు కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలంటూ కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు మండల డప్పు కళాకారులు ధర్నా చేశారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షురాలు జోతమ్మ, ఉపాధ్యక్షులు హనుమయ్య, కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

**జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి**

**హిందూపురం టౌన్:** పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాల ఆవరణలో ఈనెల 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, కమిషనర్ మల్లికార్జున, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

**ఉచిత విద్యుత్ హామీ అమలు చేయాలి**

**సోమందేపల్లి:** చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శీలా నారాయణస్వామి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక షిర్డినగర్‌లో చేనేత కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మగ్గాల నిర్వాహకులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి రెండు నెలలు కావస్తున్నా ఆచరణకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో నేతన్న కార్మిక సంఘం నాయకులు వెంకటేష్, ఈశ్వర్, పురుషోత్తం, కిష్టప్ప, సంజీవప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

**కిశోర్‌కు ఉరిశిక్ష వేయాలి**

**పావగడ:** ప్రధాన న్యాయమూర్తి సీజేఐ బీఆర్ గవాయిపై షూ విసరడానికి ప్రయత్నించిన కిశోర్‌కు తక్షణమే ఉరిశిక్ష విధించాలని స్థానిక కర్ణాటక దళిత జాగృతి సమితి అధ్యక్షుడు డీజేఎస్ నారాయణప్ప డిమాండ్ చేశారు. వెంటనే నిందితుడిపై చర్యలు తీసుకోవాలన్నారు.

**ఆలయాభివృద్ధికి కృషి**

**అమరాపురం:** ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం ఆ ఆలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సర్వసభ్య సమావేశానికి డైరెక్టర్లకు ఆహ్వానమా?**

**చిలమత్తూరు:** నామినేటెడ్ పోస్టులు కలిగిన డైరెక్టర్లకు మండల సర్వసభ్య సమావేశానికి ఆహ్వానించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్న ఎంపీడీఓ రమణమూర్తి సర్వసభ్య సమావేశం నోటీసు ప్రతిలో రాష్ట్ర డైరెక్టర్ల పేర్లు ప్రస్తావిస్తూ ఆహ్వానం ఇచ్చారు. ఎంపీడీఓను 'సాక్షి' వివరణ కోరగా వారికి ప్రోటోకాల్ ఉందని, పదుల సంఖ్యలో డైరెక్టర్లు ఉంటారని, అమడగూరు లో అలాగే రాశారని పేర్కొనడం గమనార్హం.

### పార్టీ బలోపేతానికి కృషి


వైటీ ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**మడకశిర:** నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. సోమవారం తన స్వగృహంలో వైటీ ప్రభాకర్ రెడ్డిని మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి సీఈసీ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ బోయ సతీష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి, ఓంకుమార్, మణికంఠ, సుదీర్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పరామర్శ


కౌన్సిలర్ మల్లికార్జునను పరామర్శిస్తున్న దీపిక

**చిలమత్తూరు:** హిందూపురం పట్టణంలోని పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక సోమవారం సాయంత్రం పరామర్శించారు. 28వ వార్డు కౌన్సిలర్ మల్లికార్జున, మరో నాయకుడు రామ్మూర్తిల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే 9వ వార్డు ఇన్‌చార్జ్ జయసింహ చిన్నాన్న ప్రమాదంలో గాయపడగా ఆయన్ను కూడా పరామర్శించారు. కార్యక్రమంలో శ్రీరాములు, అంబేద్కర్ నవీన్, నరసింహులు, కొటిపి వేణుగోపాల్‌రెడ్డి, కురుబ హరి పాల్గొన్నారు.

### నా భూమిని కాపాడండయ్యా..


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న బాధితుడు కుళ్లాయప్ప

**పెనుకొండ రూరల్:** తన భూమి ఆక్రమణకు గురికాకుండా చూడండయ్యా అని సోమందేపల్లికి చెందిన కుళ్లాయప్ప సోమవారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమందేపల్లిలోని సర్వే నంబర్ 145-1లో 4-87 సెంట్లు భూమిలో గత 20 ఏళ్లుగా పండ్ల మొక్కలు నాటి సాగు చేసుకుంటున్నానన్నారు. కొంత భాగం హెచ్ఎన్ఎస్ కాలువ కోసం ప్రభుత్వం తీసుకుందని చెప్పారు. అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. 2015లో ఎకరం భూమికి పట్టా ఇచ్చారన్నారు. సదరు భూమికి 1బీ, అడంగల్ కోసం పలుమార్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించినా ఫలితం లేకపోయిందన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కొందరు ఆ భూమిలో కమ్యూనిటీ హాల్, ఆలయం పేరుతో అక్రమంగా షెడ్లు వేశారన్నారు. కోర్టులో సమస్య పరిష్కారం అయ్యే వరకూ సదరు భూమిలో ఎలాంటి నిర్మాణ పనులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను కోరారు.

### 10న మండల మీట్

**రొళ్ల:** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఈనెల 10న సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి తెలిపారు.